# బ్లాక్ పార్టీ

ఈ శీర్షిక పేరు బ్లాక్ పార్టీ. Black Party కాదు Block Party. మన తెలుగు లిపిలో ఈ రెండిటికీ తేడా చూపటం వీలులేదు కనుక, ఇంగ్లీషులో ఈ వివరణ ఇవ్వాల్సివచ్చింది. అమెరికాలో బ్లాక్ అన్నదానికి రకరకాల అర్థాలున్నాయి. రోడ్ల మీద పక్కపక్కనే వున్న ఒక జంక్షనుకీ ఇంకో జంక్షన్‌కీ మధ్య దూరాన్ని ఒక బ్లాకు దూరం అంటారు. అంటే తెలుగులో బ్లాకెడు దూరం అన్నమాట. అదే మా సబ్ డివిజన్‌లో అయితే (అంటే మా కాలనీలో అయితే ) మా రోడ్డు మీద వున్న ఇళ్ళన్నీ ఒక బ్లాకులో వున్నాయన్నమాట. మరి బ్లాక్ పార్టీ అంటే?

0 0 0

ప్రతి సంవత్సరం ఇవి జరుగుతూనే వున్నాయి. పోయిన సంవత్సరం అది ఎలా జరిగిందో చూద్దాం.

వేసవికాలం. శనివారం సాయంత్రం ఏడు గంటలు. సూర్యాస్తమయం ఏడున్నర గంటలకయినా, రాత్రి తొమ్మిది గంటలదాకా పగటి వెలుగు వుంటుంది ఎండాకాలంలో. ఈసారి మా బ్లాక్ పార్టీ మా ఇంటి ఎదురు ఇంట్లోని ఆండ్రూ సూసన్ ఇస్తున్నారు. ఏడు గంటలకే రమ్మన్నారు కాబట్టి ఏడు గంటలకే అందరూ వచ్చి ఆరు బయట లాన్‌లో చెట్ల క్రింద చేరి కబుర్లు చెప్పుకుంటున్నారు. మేమూ అదే టైముకి అక్కడికి వెళ్ళాం. ఆహ్వానం పంపించినప్పుడు అందర్నీ ఏదో ఒక చిరుతిండి తెమ్మన్నారు కనుక, ఉల్లిపాయ పకోడీలు చేసి ఒక చిన్న ట్రేలో తీసుకు వచ్చింది శ్రీమతి.

బల్ల మీద రకరకాల తినుబండారాలు వున్నాయి. అందరూ భోజనాలు చేసి వస్తారు కనుక, అక్కడ వున్నవన్నీ చిప్స్, పళ్ళు, కేక్‌లాటి చిల్లరతిళ్ళూ, స్ట్రాబెర్రీ పంచ్ డ్రింక్ మొదలైనవి. ఒక లాన్‌ఛైర్‌లో కూర్చుని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ ఫుట్‌బాల్ టీం క్రిందటిరోజు ఎలా గెలిచిందో చెబుతున్నాడు టాం. అతనికి చెరోపక్కా కూర్చుని వింటున్నారు అతిథి దేవుడు ఆండ్రూ పక్కింటి పాల్. బల్లమీద వున్న ప్రెట్జల్స్‌ని తన ప్లేట్లో నింపుకుని, శ్రీమతితో వాటర్ బిల్ ఎందుకు పెరిగిందో చెబుతున్నాడు బిల్. సూసన్ జోకు చెబుతుంటే నవ్వుతున్నది నాన్సీ. అక్కడే ఆడుకుంటున్నారు పిల్లలు నలుగురూ. చంకలో సంవత్సరం వయసున్న కొడుకుని ఎత్తుకుని అప్పుడే వచ్చింది ఎలిజబెత్. చల్లటి గాలి వీస్తుంటే, ఆ ఆహ్లాద వాతావరణంలో అందరూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు.

ఆండ్రూ అంటున్నాడు 'ఈసారి మన బ్లాక్ టీం బాగుంది కానీ, ఇంకా ఒక వాలంటీరు కావాలి'

'దేనికి. నైబర్ హుడ్ ప్రోగ్రాం వాచ్ కా?' అడిగాడు టాం.

'లేదు దానికి బాగానే వున్నారు వాలంటీర్లు. స్విమ్మింగ్ పూల్ దగ్గర లైఫ్

గార్డ్‌గా వుండటానికి... ఎవరైనా అనుభవం వున్నవాళ్ళు కావాలి... ' అన్నాడు ఆండ్రూ.

ఎలిజబెత్ కొడుకు గురించి చెబుతుంటే వింటున్నది సూసన్. వాడి అల్లరి గురించి మాట్లాడుకుంటున్నారు కాబోలు పెద్దగా నవ్వుతూ చెప్పుకుంటున్నారు. ఒక పకోడీ నోట్లో వేసుకుని, బాగుందే ఏమిటిది అని శ్రీమతిని అడుగుతున్నాడు టామ్.

అప్పుడే వచ్చింది ఫ్లూగర్‌విల్ సిటీవారి ఫైర్ ఇంజన్. చెప్పటం మరిచి పోయాను. మా ఊరి పేరు ఫ్లూగర్‌విల్. టెక్సాస్ రాజధాని ఆస్టిన్ నగరానికి ఆనుకుని వుంటుంది. చిన్న జర్మన్ టౌన్. ఇరవై వేల జనాభా. చిన్న వూరులోని సుఖాలన్నీ వున్నాయి. సిటీ జీవితం కావాలంటే ఐదు మైళ్ళ దూరంలో అదీ వుంది. అందుకే చాలమంది ఇలాటి వూళ్ళల్లో వుండటానికి ఇష్టపడతారు. ఫైర్ ఇంజన్ని రోడ్డు పక్కన ఆపి, దాంట్లోనించి ఒక ఫైర్ ఆఫీసరూ, ఇద్దరు ఫైర్మెన్లూ దిగారు. అది ఆగగానే పిల్లలందరూ అక్కడికి పరిగెత్తుకుంటూ వెళ్ళారు. అక్కడవున్న నలుగురు పిల్లల వయస్సూ మూడు నించీ ఏడు ధాకా వుంటుందేమో.

ఫైర్ ఆఫీసర్ మోకాళ్ళ మీద కూర్చుని ఫైర్ సర్వీసు వాళ్ళు సిటీలో ఏమేం చేస్తారో చెబుతున్నాడు. 'ఇళ్ళు తగల బడుతున్నా, ఇంకెక్కడయినా మంటలు వచ్చినా ఆర్పటమే కాకుండా, ఒక పిల్లి పిల్ల ఎలెక్ట్రిక్ స్థంభం ఎక్కి దిగటానికి భయపడి అరుస్తుంటే ఏంచేశారో చెబుతున్నాడు. ఫైరింజన్‌కి నిచ్చెన వుంటుందనీ అలా మడిచి వున్న దాన్ని ఎంత పొడుగుగా పైకి లాగచ్చో చెబుతున్నాడు. నాకు నిచ్చెన చూపిస్తావా అని అడుగుతున్నాడు ఒక పిల్లాడు. రండి చూపిస్తాను అని అందర్నీ ఫైర్ ఇంజన్ మీదకి ఎక్కించాడు అతను. ముందుగా నిచ్చెన చూపించాడు. నేనూ, నాతో పాటూ అందరూ అక్కడ నుంచొని చూస్తున్నాం. మా కుతూహలం చూసి అతను అక్కడ వున్న కంట్రోల్సూ వాల్వులూ ట్యూబులూ అన్నీ చూపించి, వివరణగా చెబుతున్నాడు.

'ఈ ఫైర్ ఇంజన్ కొత్తగా కొన్నాం. ఎంతో టెక్నాలజీ వుంది దీంట్లో. మన సిటీకి మూడో ఇంజన్. ఇప్పటికి సరిపోతుంది. జనాభా ఇంకా పెరిగితే, అప్పుడు ఇంకోటి కొంటాం' ఇలా చెప్పుకొస్తున్నాడు అతను.

ఇంకొక ఫైర్మన్ చెబుతున్నాడు. 'మా పనులు ఇంకా వున్నాయి. రెస్టారెంట్లలో, షాపుల్లో, ఆఫీసుల్లోవున్న స్థల విస్తీర్ణం బట్టీ, ఎన్ని తలుపులున్నాయన్న దాన్ని బట్టీ, మేము ఎంతమంది అక్కడ వుండవచ్చునో సర్టిఫికేట్ ఇస్తాం. అంతకన్నా దాట కూడదు. మేము ఇన్‌స్పెక్షన్‌కి వెళ్ళినా ఎవరైనా పౌరులు ఫిర్యాదు చేసినా మేము వాళ్ళకి ఫైన్ వేస్తాం. అదే రెండోసారి కూడా జరిగితే, వాళ్ళు తలుపులు మూసెయ్యాల్సిందే అలాగే ఎమర్జెన్సీలు. మా అందరికీ సి.పి.ర్., ఆక్సిజన్ ఇవ్వటంలాటి వాటిలో ట్రెయినింగ్ ఇస్తారు. అవసరాన్ని బట్టి ప్రాణరక్షణ చేస్తుంటాం. అందుకే మీరు కారులో వెడుతున్నారనుకోండి. మేము అలారం మోగిస్తూ వస్తుంటే, అందరూ పక్కకి తప్పుకుని మాకు దారి ఇవ్వాలన్న మాట'

'సిగ్నల్ దగ్గర ఎర్ర లైట్ వుంటే?' అడుగుతున్నది ఐదేళ్ళ లీసా.

'ఉన్నా సరే, మేము వెళ్ళచ్చు. అందరూ ఎక్కడికక్కడ ఆగిపోతారు కదా. అయినా జాగ్రత్తగా వెడతాంలే' అంటున్నాడు పెద్దగా నవ్వుతూ.

మూడో అతను నవ్వుతూ అన్నాడు పిల్లలతో - 'ఈ ఫైర్ ఇంజన్లు మీ తల్లిదండ్రులు కట్టిన టాక్స్ డబ్బులతో కొన్నవే తెలుసా? అంటే ఇది మీదే.. ' అని. 'ఇది మనదే బి కేర్‌ఫుల్. పాడు చేయకండి' అంటున్నాడు నాలుగేళ్ళ నిక్. చిన్న పిల్లలయినా పెద్ద ప్రశ్నలడుగుతూ అన్నీ తెలుసుకుంటున్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ వాళ్ళు కూడా ఓపిగ్గా అన్ని ప్రశ్నలకీ జవాబులు చెప్పటమే కాకుండా, వాళ్ళకి అన్నీ దగ్గరుండి చూపిస్తున్నారు. ఫైర్ ఇంజన్ బయల్దేరింది. పిల్లలందరూ చేతులు ఊపి 'బై' అంటున్నారు. ఆండ్రూ వాళ్ళతో అంటున్నాడు 'వచ్చినందుకు థాంక్స్' అని.

వాళ్ళటు వెళ్ళగానే ఒక పోలీసు కారు వచ్చింది. దాంట్లోనించి ఇద్దరు ఆఫీసర్లు దిగారు. ఒకతను జో. ఇంకొకతను జిమ్. జో కారు వెనక తలుపు తెరిచి ఒక పెద్ద కుక్కని క్రిందకు దించాడు. అది మూడున్నర అడుగుల ఎత్తుంది. ఎంతో బలంగా వుంది. నోరు తెరిచి ముందుకు వస్తుంటే పిల్లలందరూ వెనక్కి పరుగెత్తారు.

'ఫాక్సీ ఏం చేయదు. మంచివాడు' జో అన్నాడు. అతనామాటన్న తర్వాత లీసాకి ధైర్యం వచ్చింది. దగ్గరికి వెళ్ళి 'హాయ్ ఫాక్సీ' అంటూ చేయి ముందుకు చాపింది. ఫాక్సీ జుట్టుని నిమిరింది మెడ దగ్గర. ఫాక్సీ లీసా కాళ్ళకి ఆనుకుని, తన ప్రేమ చూపించింది. అది చూసి మిగతా పిల్లలూ ముందుకి వచ్చారు.

జో పిల్లలకి చెబుతున్నాడు 'ఫాక్సీ దొంగల్నీ, హంతకులనీ, మాదక ద్రవ్యాలని తెచ్చేవారినీ చటుక్కన పట్టేస్తాడు. ఇప్పటికి ఎంతమందిని పట్టుకున్నాడో. వాసన పట్టాడంటే, దొంగ దొరికాడాన్నమాటే... '

పిల్లలు కుక్కతో స్నేహంగావుంటూ, పోలీసులని రకరకాల ప్రశ్నలు అడుగుతున్నారు. మా సబ్‌డివిజన్‌లో నేరం ఎలా వుంది. పోలీసులు ఎలా అది అరికట్టటానికి ప్రయత్నంచేస్తున్నారు మొదలైనవి. నాకూ కొన్ని ప్రశ్నలు వున్నాయి మరి. అందుకే జిమ్‌ని అడిగాను ఫాక్సీ మీ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీనా అని.

అతను నవ్వాడు. 'అవును. మంచి ఎంప్లాయీ కూడాను. సర్వీసులో చేరి నాలుగేళ్ళయింది. ఫాక్సీఅంటే నేరస్థులకి ఎంత భయమో డిపార్ట్‌మెంట్లో అంత పేరు'

ఎలిజబెత్ అడుగుతున్నది 'ఎంప్లాయీ అంటే ఎలా' అని.

జిమ్ చెబుతున్నాడు. 'మనుష్యులలాగానే కుక్కల్ని కూడా ఇంటర్వ్యూ చేసి ఉద్యోగం ఇస్తాం. కొత్త ఉద్యోగులలాగానే వాటికివ్వవలసిన ట్రైనింగ్ ఇస్తాం. ఒక్కొక్క కుక్కని ఒక్కొక్క సీనియర్ పోలీస్ ఆఫీసర్‌కి అనుబంధంగా వుంచుతాం. వాళ్ళిద్దరికీ ఆ బంధం వుండటం అవసరం. జోకి జోడీ ఫాక్సీ. నెలనెలా ఫాక్సీ జీతం జోకి ఇస్తారు. కావలసిన ఆహారం ఇవ్వటం, అవసరమైన వైద్య సహాయం చేయించటం, తన ఇంట్లో వుంచుకోవటం అన్నీ చేస్తాడు. మరిచిపోయాను మాలాగానే ఫాక్సీకి కూడా మెడికల్ ఇన్స్యూరెన్స్, రిటైర్మెంట్ పెన్షన్, శెలవలూ అన్నీ వుంటాయి. ఫాక్సీ రిటైర్ అయాక కూడా పోషణ భారం జోదే. అతను ఏ కారణం చేతయినా చేయలేకపోతే, ఎవరు చేస్తే వాళ్ళకి ఇస్తారు ఆ పెన్షన్'

'బాగాచీకటి పడింది' అంటున్నది శ్రీమతి. 'అవును. ఇక వెడదాం' అని అందరికీ చెప్పి, ఆరోజు జరిగిన మా బ్లాక్ పార్టీకి గుడ్‌బై చెప్పి, ఇంటికి వచ్చేశాం.